శ్రీధర్ , బాలాజీ కాలనీల వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

విశ్వంభర , మీర్ పేట్ : వర్షాకాలంలో కురిసే వర్షాలకు పైన ఉన్న సుమారు 40 కాలనీల వరద నీరంతా వచ్చి శ్రీధర్ కాలనీ, బాలాజీ కాలనీలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో, శ్రీధర్ కాలనీ ఎదురుగా ఉన్న డ్రైనేజీ అవుట్ లెట్ వద్ద పాత కల్వర్టు ప్రాంతంలో కొత్త పైప్ లైన్ అవుట్ లెట్ నిర్మించారు.ఈ సమస్యను గతంలో స్థానిక నాయకులు ఆర్కల కామేష్ రెడ్డి ద్వారా తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి బడ్జెట్ తక్కువగా ఉన్నప్పటికీ ప్రజా శ్రేయస్సును ధ్యేయంగా ముందుకు కదిలి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా మీర్ పేట్ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆర్కల కామేష్ రెడ్డి మాట్లాడుతూ "ఇలాంటి సమస్యలు మరెన్నో చోట్ల ఉన్నాయి. ఆయా కాలనీ వాసుల వినతులు స్వీకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు అవసరమైన బడ్జెట్ ను తీసుకువచ్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాను. అందరి సంపూర్ణ సహకారంతో ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కాలనీ అధ్యక్షుడు శాంతమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్వెస్టిగేషన్ అధ్యక్షుడిగా కొలుకులపల్లి వెంకటేష్

విశ్వంభర, ఎల్బీనగర్ : హ్యూమన్ రైట్స్ పీస్ ఆర్గనైజేషన్ ఫుడ్ ఇన్వెస్టిగేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా కొలుకులపల్లి వెంకటేష్ నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని సంస్థ డైరెక్టర్ నేమ్ ఖాన్ సలీం ఖాన్, కోటగిరి ఉషారాణి చేతుల మీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కృతజ్ఞత లు తెలియజేశారు. మానవ హక్కుల ఉల్లంఘనలతో పోరాటం నేరుగా గాని, ప్రభుత్వ చట్ట అమలు ఏజెన్సీలు / కోర్టుల ద్వారా హక్కులు ఉల్లంఘించబడిన వారికి సహాయం న్యాయ సహాయం అందించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజా అవగాహన కార్యక్రమాలు,ప్రజాస్వామ్యం , అవినీతి వ్యతిరేకతకు వాదించడం. మంచి పాలన ప్రభుత్వ విధానాలకు మద్దతు ఇవ్వడం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

విశ్వంభర, చైతన్య పురి : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చైతన్యపురి వినాయక నగర్, సత్యనగర్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ వెనుక భాగంలో ఉన్న మూసీ నదిలో ఒక వ్యక్తి మృతదేహం తేలుతూ ఉన్నట్లు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందిందినట్లు తెలిపారు. పెట్రోలింగ్ మొబైల్ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక ప్రజల సహాయంతో నదిలో నుండి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడి వయసు 3040 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సంపూర్ణ సూర్య గ్రహణం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ఈ ఏడాదిలో సంభవించే అత్యంత అరుదైన తొలి 'సంపూర్ణ సూర్యగ్రహణం' నేడు ఏర్పడనుంది. కాగా ఈ అమావాస్యను చుక్కల అమావాస్య కూడా అంటారు. ఈ ఖగోళ అద్భుతాన్ని ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 55 దేశాల్లో ఏదో ఒక దశలో కనిపించనుంది. అయితే భారత కాలమానం ప్రకారం ఇక్కడ రాత్రి ఉండటంతో ఈ సూర్యగ్రహణం మనదేశంలో కనపడదు. సాయంత్రం 7 గంటల నుంచి తెల్లవారు జామున 3.30 గంటల వరకు ప్రపంచవ్యాప్తంగా కనిపించే ఈ గ్రహణంలో కేవలం స్పెయిన్, ఐస్‌లాండ్ దేశాల్లో మాత్రమే పూర్తిస్థాయి 'సంపూర్ణ సూర్యగ్రహణం' ప్రత్యక్షమవుతుంది. ఆ సమయంలో అక్కడి ప్రాంతాల్లో సూర్యుడు పూర్తిగా చంద్రుని వెనుక దాగి చీకటి అలుముకుంటుంది. మిగిలిన 53 దేశాల్లో మాత్రం ఇది 'పాక్షిక సూర్యగ్రహణం'గా మాత్రమే దర్శనమివ్వనుంది. భారత్‌లో కనిపించకపోయినప్పటికీ ఖగోళ ప్రేమికులు, శాస్త్రవేత్తలు ఈ అరుదైన దృశ్యాన్ని వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

జీనోమ్ వ్యాలీలో యామ్జెన్ భారీ పరిశోధన కేంద్రం

విశ్వంభర, హైదరాబాద్ : జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ బయోటెక్నాలజీ సంస్థ యామ్జెన్ ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.అంతకుముందు శ్రీధర్‌బాబుతో సమావేశమైన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. అనంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కొత్త పరిశోధన కేంద్రం ద్వారా స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇటీవల యామ్జెన్ 3 వేల మంది ఉద్యోగులతో భారీ గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఔషధ రంగ దిగ్గజ సంస్థలు తెలంగాణపై విశ్వాసం వ్యక్తం చేయడం రాష్ట్రానికి గౌరవమన్నారు. నైపుణ్యమున్న మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన జీవశాస్త్ర పర్యావరణ వ్యవస్థతో తెలంగాణ ప్రపంచ లైఫ్‌సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందన్నారు. కొత్త ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరారు. యామ్జెన్ దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, వాపు, శ్వాసకోశ, అరుదైన వ్యాధులకు వినూత్న చికిత్సల అభివృద్ధిపై పరిశోధనలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో: పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఈడీ శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

"జెన్ సిస్" ఘరానా దోపిడీ!!

- ఐవిఎఫ్ కార్పొరేట్ వైద్యం పేరుతో లక్షల్లో దోపిడీ చేశారంటున్న బాధితులు
- 8నెలల గర్భవతికి జెన్ సిస్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో అబార్షన్
- సరైన వైద్య సేవ లేకపోవడంతోనే మహిళ గర్భాశయంలో పెరగని శిశువు.. బాధితుల ఆరోపణ
- కొత్తపేట మెట్రో స్టేషన్ సమీపంలోని జెన్ సిస్ సంతాన సాఫల్య కేంద్రంలో సంఘటన
- చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశామన్న బాధితులు



విశ్వంభర , ఎల్బీనగర్: ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యాన్ని వ్యాపారంగా మల్చిన కొన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో యజమాన్యాలు ఇష్టానుసారంగా ప్రజలను దోచుకుంటున్నాయి. కొత్తపేట మెట్రో స్టేషన్ సమీపంలోని గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్నటువంటి జెన్ సిస్ సంతాన సాఫల్య కేంద్రంలో జరిగిన ఓ దారుణ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పిల్లలు లేని దంపతులను టార్గెట్ చేస్తూ ఐ వి ఎఫ్ పద్ధతిలో సంతాన భాగ్యం కలిగిస్తామని, లక్షల్లో వసూళ్లకు పాల్పడి చివరికి బాధితురాలికి సంతాన భాగ్యం కలగకపోగా, ఆ మహిళకు మాతృమూర్తి అనే పదాన్ని దూరం చేసే విధంగా జెన్ సిస్ సంతాన సాఫల్య కేంద్రం వైద్య బృందం తమకు తీవ్ర అన్యాయం చేశారని బాధితులు ఆందోళనకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధిత మహిళ కుటుంబ సభ్యులు, బహుజన సంఘాల నాయకులు వెల్లడించిన వివరాల ప్రకారం. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం బోటిమీది తండా గ్రామానికి చెందిన నేనావత్ గీత (32), నేనావత్ జయపాల్ నాయక్ (41) భార్యాభర్తలు. వీరికి సంతానం లేకపోవడంతో భార్యాభర్తలు ఇద్దరు గత సంవత్సరం 2025 మే నెల నుండి కొత్తపేట మెట్రో స్టేషన్ సమీపంలోని జెన్ సిస్ సంతాన సాఫల్య కేంద్రం ప్రముఖ వైద్యురాలు ఆర్ నర్మదా వేణుగోపాల్ వైద్యురాలు పర్యవేక్షణలో వైద్యం చేయించుకుంటున్నామని బాధితురాలు గీత కుటుంబ సభ్యులు వెల్లడించారు. గత ఎనిమిది నెలలుగా సాఫల్య కేంద్రంలో వైద్యం చేయించుకున్నప్పటికీ అన్ని పరీక్షలు నిర్వహించిన డాక్టర్ నర్మదా శిశువు బాగానే పెరుగుతుందని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని తెలిపిందని వారు వాపోయారు. ఈ క్రమంలో బాధితురాలు గీత అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మరోచోట వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భంలో ఉన్న శిశువు మృతి చెందిందని, వెంటనే ఆపరేషన్ చేయించుకోపోతే తల్లి ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలియడంతో బాధితులు తీవ్ర ఆందోళన గురయ్యామని వారు వెల్లడించారు. ఇతర వైద్యుల సూచన మేరకు తల్లి ప్రాణాలను కాపాడుకోవాలని లక్ష్యంతోనే అబార్షన్ చేయించాల్సి వచ్చిందని వారు వెల్లడించారు. తమకు జరిగిన అన్యాయంపై బాధితురాలు గీతకు చికిత్స అందించినటువంటి జెన్ సిస్ సంతాన సాఫల్య కేంద్రంలో ఈ విషయమై బాధితులు డాక్టర్ నర్మదాను సంప్రదించగా బెదిరింపులకు పాల్పడిందని వారు ఆరోపించారు. ఈ క్రమంలో బాధితురాలు బంధువుల కుటుంబ సభ్యులు, బహుజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆసుపత్రి ఆవరణకు చేరుకొని తమకు న్యాయం చేయాలంటూ బాధితులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తమకు అన్యాయం జరిగిన తీరును వారు విలేకరుల ముందు గోడు వెళ్ళబోసుకొని, వైద్యం పేరుతో లక్షల రూపాయలను దోపిడీ చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న చైతన్యపురి పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్మదా మీ దిక్కున చోట చెప్పుకో అంటూ బాధితులను బెదిరించిందని, ఆస్పత్రిలో ఓ ప్రైవేట్ సైన్యం ఏర్పాటు చేసుకొని తమపై దాడికి ప్రయత్నించారని బహుజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలంలోనే ఉన్న చైతన్యపురి పోలీసులు ఇరు వర్గాలను సందాయించడంతో పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం బాధితులు చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని, బాధితురాలికి న్యాయం చేయకపోతే బుధవారం ఉదయం తీవ్రస్థాయిలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సంఘటనపై వివరణ కోరేందుకు ఆసుపత్రిలో సంప్రదించగా డాక్టర్ అందుబాటులో లేరని సిబ్బంది చెప్పడం గమనార్హం.

తుపాకీ వెనుక ఓ మనిషి కథ ఉంది..!

బలమైన సామాజిక అంశంతో తెరకెక్కుతున్న 'గడి'

విశ్వంభర, హైదరాబాద్ : ఒక సాధారణ మనిషి చేతిలోకి తుపాకీ ఎందుకు వచ్చింది..? దాని వెనుక ఉన్న పరిస్థితులు ఏంటి..? జీవితంలో ఎదురైన అనుభవాలు అతడిని ఎలాంటి నిర్ణయాల వైపు నడిపించాయి..? అనే ప్రశ్నలకు సమాధానమే 'గడి' సినిమా అని చిత్ర దర్శకుడు రామ్ ఇస్లావత్ తెలిపారు.

రాపర్తి ఆయిల్ మల్లూ జీవితంలో చోటు చేసుకున్న పరిస్థితులను, అతను తుపాకీ పట్టేలా చేసిన సామాజిక నేపథ్యాన్ని కథాంశంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు వెల్లడించారు. మట్టి మనుషుల జీవితం, వారి పోరాటం, ఆత్మగౌరవం, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా కథను రూపొందించినట్లు చెప్పారు. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రూపొందుతున్న 'గడి' చిత్రం ప్రేక్షకుల్లో ఆలోచన రేకెత్తించే విధంగా ఉంటుందని పేర్కొన్నారు.

సహజ లొకేషన్లలో చిత్రీకరణ

ఇప్పటికే కిష్టాపురం తండా, వికారాబాద్ అటవీ ప్రాంతం, చన్గోముల్ పరిసర ప్రాంతాల్లో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు దర్శకుడు తెలిపారు. కథకు అనుగుణమైన సహజ వాతావరణం, అక్కడి ప్రజల జీవన విధానం ప్రతిబింబించేలా సహజమైన లొకేషన్లలో చిత్రీకరణ సాగిందన్నారు. కథలోని భావోద్వేగాలను, పాత్రల సంఘర్షణలను సహజత్వానికి దగ్గరగా తెరపై ఆవిష్కరించేందుకు చిత్ర బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రముఖ నటీనటులతో 'గడి'

'గడి' చిత్రంలో సూర్య కెశిరెడ్డి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. రమణ, వర్షిత్ కొన్రెడ్డి, మహేందర్, వరుణ్, ఎ. రామ్, రమేష్, వీర తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రతి పాత్ర కథను ముందుకు నడిపించే విధంగా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.

చిత్రానికి సంగీతం వర్షిత్ కొన్‌రెడ్డి, ఛాయాగ్రహణం కృష్ణ, అసిస్టెంట్ ఫొటోగ్రఫీ హర్ష పొన్నమండ, ఎడిటింగ్ అక్షయ్ అందిస్తున్నారు.

ప్రస్తుతం 'గడి' చిత్రానికి సంబంధించిన నిర్మాణ, తదుపరి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చిత్ర బృందం తెలిపింది. త్వరలోనే 'గడి' టీజర్‌తో పాటు ఇతర ప్రచార కార్యక్రమాల వివరాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. సామాజిక అంశంతో పాటు బలమైన కథనం, సహజమైన చిత్రీకరణతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేసింది.

ప్రైవేటు మెడికల్ కాలేజీల ఫీజు దోపిడీ ఆపండి

ఎఫ్ఆర్సీని ముట్టడించిన మెడికో పేరెంట్స్!

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వసూలు చేస్తున్న అక్రమ ఫీజుల దోపిడీని ఆపాలంటూ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎఫ్ఆర్సీని ముట్టడించారు. ఎన్నిసార్లు ఎఫ్ఆర్సీకి వచ్చినా ప్రైవేటు మెడికల్ కాలేజీలు అదనంగా వసూలు చేస్తున్న ఫీజులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేరెంట్స్ మండిపడ్డారు. ఈ మేరకు ఎఫ్ఆర్సీ చైర్మన్‌కు అనేక మంది మెడికోల పేరెంట్స్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు పేరెంట్స్ పట్ల చైర్మన్ అభ్యంతరకరంగా మాట్లాడారని ఆరోపించారు. గతంలో చైర్మన్ అనేకమార్లు కలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మెడికో పేరెంట్ జి.శ్రీనివాస్ ఆరోపించారు. విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నా స్పందించని చైర్మన్ ఎందుకోసం అని ఆయన విమర్శించారు. విద్యార్థుల నుంచి నాలుగున్నరేళ్ల ఫీజులకు గాను ఐదేళ్ల ఫీజులు వసూలు చేస్తున్నా ఎఫ్ఆర్సీ స్పందించడం లేదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల చైర్మన్ వ్యవహరించిన తీరు బాగోలేదని మండిపడ్డారు. ప్రైవేటు మెడికల్ కాలేజీలు కోరినట్లుగా అదనపు ఫీజులు చెల్లించని విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వకుండా వేధిస్తున్నారని యాదగిరి అనే మెడికో పేరెంట్ తెలిపారు. అనంతరం మెడికో పేరెంట్స్ అంతా కలిసి చైర్మన్ కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లేసరికి ఆయన కార్యాలయం నుంచి వెళ్లిపోయారని ఆరోపణలు వచ్చాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడెక్కడి నుంచో తమ సమస్య చెప్పుకునేందుకు వస్తే స్పందన లేదంటూ చైర్మన్ ఛాంబర్ లోనే ఆందోళనకు దిగారు. అనంతరం ఎఫ్ఆర్సీ ఓఎస్డీ జగన్ మోహన్ రావు విద్యార్థుల తల్లితండ్రులకు నచ్చజెప్పారు. నాలుగున్నర ఏళ్లకే ఫీజులు వసూలు చేయాలంటూ తాము బుధవారం నాడు అన్ని ప్రైవేటు కాలేజీలకు నోటీసులు పంపిస్తామని తెలిపారు. అలాగే ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యార్థుల అటెండెన్స్ ఆపడం కానీ, వారిని పరీక్షలకు అనుమతించకపోవడం కానీ చేయవద్దని స్పష్టం చేస్తామని చెప్పారు. దీంతో శాంతించిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆందోళనను విరమించారు. అదనపు ఫీజులు వసూలు చేస్తే ఈసారి పెద్ద ఎత్తున ఎఫ్ఆర్సీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈనెల 31న నిజామాబాద్‌కు కవిత

విశ్వంభర, నిజామాబాద్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా పార్టీ చీఫ్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఈనెల 31న నిజామాబాద్‌కు రానున్నారు. కలెక్టరేట్ గ్రౌండ్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. సభలో పార్టీ నిర్దేశించుకున్న ఐదు లక్ష్యాలను కవిత వివరించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను పల్లెపల్లెకు తీసుకెళ్లాలని శ్రేణులకు పిలుపునివ్వనున్నట్లు నాయకులు తెలిపారు. సభ ఏర్పాట్లపై నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సభను భారీగా విజయవంతం చేసి కవితకు ఘన స్వాగతం పలకాలని పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎ. అలీమ్ పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని రాష్ట్ర నాయకుడు నవీన్ ఆచారి కోరారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సభ తేదీని ఈనెల 31కి మార్చినట్లు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రఘు, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్ రెడ్డి మాట్లాడుతూ వివిధ సమస్యలపై పార్టీ చేపట్టిన ఉద్యమాలకు మద్దతు ఇచ్చిన వర్గాలను సభకు సమీకరించాలని సూచించారు. సన్నాహక సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ లోని ఎస్ఎంఆర్ కన్వెషన్ హాల్‌లో కాచం శ్రీనివాస్ 68వ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కాచం సాయి, శ్రీధర్, మురళి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, కొత్త రవి, శ్రీను.

22 లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: హైదరాబాద్ దోమల్‌గూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కాలేజీ (జీసీపీఈ)లో ఖాళీగా ఉన్న 22 లెక్చరర్ పోస్టులను డెప్యుటేషన్ విధానంలో భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తెలిపారు. ఫారిన్ సర్వీస్ నిబంధనల ప్రకారం ఏడాది కాలానికి లేదా క్రమబద్ధమైన నియామకాలు జరిగే వరకు ఈ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయి. దరఖాస్తు ఫీజు రూ. 500 చెల్లించి అధికారిక వెబ్‌సైట్ https://schooledu.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 17 నుండి 27 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ లేదా స్థానిక సంస్థల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) గా కనీసం 5 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలి. జులై 31 నాటికి కనీసం 3 ఏళ్ల మిగిలిన (రిటైర్మెంట్‌కు ముందు) సర్వీస్ కలిగి ఉండాలి. గుర్తింపు పొందిన యూనివర్శిటీ కనీసం 55 శాతం మార్కులతో ఎంపీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. పూర్తి సమాచారం కోసం పాఠశాల విద్యా శాఖ వెబ్ సైట్ ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పింగళి వెంకయ్యకు 'భారత రత్న' ఇవ్వాలి

ప్రధాని మోడీకి వి. హెచ్ లేఖ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : భారత జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్యకు భారత రత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు డిమాండ్ చేశారు. ఆ మహనీయుడు రూపొందించిన జెండా దేశానికి ప్రతీకగా మారిందని, ఆయన సేవలకు తగిన గుర్తింపు దక్కాలంటే భారత రత్న ప్రకటించడమే సరైన న్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. ఆ వివరాలను న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా ఆగస్టు 14న ట్యాంక్ బండ్‌పై పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడం శుభపరిణామమేనని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు జాతీయ జెండాను ఎగరవేసేందుకు వెనుకాడిన ఆర్ఎస్ఎస్, ఇప్పుడు ప్రతి ఇంట్లో జెండా ఎగరవేయాలని పిలుపునివ్వడం, వారిలో వచ్చిన మంచి మార్పునకు సంకేతమన్నారు. అయితే ఆ జెండాను తయారు చేసిన పింగళి వెంకయ్యకు భారత రత్న ఇచ్చి గౌరవిస్తేనే దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులకు, అమరవీరులకు సరైన గుర్తింపు లభించినట్లవుతుందని పేర్కొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108